వాయిదా వేసేడట. నాలుగోసారి వెళ్లినపుడు తెలుగు మేష్టారికి వోర్పు చచ్చి "ముష్టి యాభైరూపాయల కోసం ఎన్నిసార్లు తిప్పుతావు? అంత లేనివాడివైతే ఇచ్చుకోలేనని చెప్పిలేకపోయావా?" అంటూ జనాల్ని పోగేసి తిట్లకి లంకించుకున్నాట్ట. జనం అంతా ఇంగ్లీషు మేష్టారే ఇతనికి బాకీ అనుకుని "ఇచ్చీవయ్యా, పాపం ఎన్నిసార్లని తిరుగుతాడు ఆయన?" అని నచ్చజెప్పేశారుట.

గోవిందరావు నాకు క్లాసు తీసుకోవడం అయిపోగానే సాయిబాబా చేతికి ఒక మనియార్డరు ఫారమూ 35 రూపాయలూ ఇచ్చేడు. "రేపు నేనూళ్లో వుండను. ఈ ఎం.వో. రేపు కట్టీ" అన్నాడు. మనియార్డరు ఫారంమీద అవతలివాళ్ల ఎడ్రస్ అచ్చువేసి ఉంది. "ఇదేంటి?" అని అడిగాను. గోవిందరావు ఒక అచ్చువేసిన కరపత్రం ఇచ్చేడు.

ఫలానా ఊళ్ళో సాయిబాబా గుడి కట్టేరుట. విగ్రహ ప్రతిష్ఠాపన కూడా అయిందిట. నిర్వహణ ఖర్చుల నిమిత్తం తృణమోపణమో కట్టమని ప్రార్థిస్తూ ఆలయ కమిటీ వారు ఆ పాంప్లెట్ వేశారు. "ఈ పాంప్లెట్ అచ్చు వేసినందుకు, మనియార్డరు ఫారం కొన్నందుకూ, ఫారం మీద మా కమిటీ అడ్రస్ అచ్చు వేయించినందుకూ ఆలయ నిధుల్లోంచి కొంత ఖర్చు చేయడమైంది. కనుక మీరు 116 నుండి 2 రూపాయల వరకు ఎంత పంపినా సంతోషమే" అని ఉంది అందులో.

"నయమే. పాంప్లెట్ పోస్టులో పంపినందుకు రూపాయి తప్పని సరిగా కలపమని అన్లేదు" అన్నాను.

"ఫాంప్లెట్ పోస్టులో రాలేదు. ఇందాక నేను స్కూటర్ మీద వస్తూవుంటే ఎర్రలైటు పడిందని ఆశీలుమెట్ట జంక్షన్ దగ్గిర ఆగినప్పుడు ఒకాయన నా జేబులో పెడుతూ - ఇంటికెళ్లి చదువుకోండి అని చెప్పేడు!"

ఆ అయిదోరోజున సాయిబాబా కొడుకు దస్తూరీతో నాకు నాలుగు పేజీల ఉత్తరం వచ్చింది - అదే గంధర్వ కన్య, శాపం, మానవ జన్మ, హత్య, గుడి, వంద రూపాయలు చందా కట్టకపోతే మా కుటుంబం సర్వనాశనం అయిపోయే ప్రమాదం - అదంతానూ. ★

# 60. జెయిలు కెళ్లని పుస్తకం

"ఏమండీ, మీకు విజయవాడ నుండి ఫోన్" అని చెప్పేసి తుర్రుమంది ఎదురింటివాళ్ల చిన్నపాప. దాంతో - సిరికింజెప్పక శంఖచక్రయుగమున్ చేదోయి సంధింపక - అన్నట్టు లుంగీ సద్దుకున్నా చొక్కా గుండీలు మాత్రం ఎగుడుదిగుడుగా పెట్టేసుకుని ఎదురింటికి పరుగెత్తాను.

"నేనూ! సదాశివరావుని! బావున్నావా?"

"ఆ, థేంక్యు, చెప్పు చెప్పు; ఏమిటి అర్జెంటు?"

"అర్జెంటని ఎవరన్నారు? ఇవాళ ఉదయమే వచ్చాను. సాయంకాలం ఖాళీ ఉంటే రాకూడదూ?"

ఎస్.టి.డిలో మాట్లాడుతున్నాడేమో అని గాభరాపడ్డాను. ఈ మాటతో కొంచెం తేరుకుని "అలాగే" అని అతనెక్కడ బసచేసిందీ, ఆ టెలీఫోన్ నెంబరూ అన్నీ కనుక్కుని రోడ్డుమీదికొచ్చి గుండీలు సర్దుకున్నాను. ఇంట్లో కెళ్లబోతూ వుంటే రాజారావు పలకరించేడు. "ఏమిటంత హడావిడి, రోడ్డు మీదికొచ్చి మరీ గుండీలు సద్దుకుంటున్నావు?" కారులో వెళుతున్నవాడే; అక్కడ ఆపిమరీ పలకరించేడు.

సంగతంతా చెప్పేక "ఇంట్లో మొగుడున్నాడని డాబామీదికెళ్లి చీర మార్చుకుందిట, ఒకావిడ!" అని జోకువేసి వెళ్లిపోయాడు రాజారావు.

సాయంకాలం సదాశివరావు బసచేసిన చోటికి వెళ్లేను. ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుని కాఫీలు తెప్పించుకుని తాగేక "ఏమిటి విశేషాలు?" అని మళ్ళీ మొదటికొచ్చేను.

"నీకు రాజారావు ఇల్లు తెలుసా?"

"ఎందుకు?"

"అతని దగ్గిరికి వెళ్ళి ఒక ఉత్తరం ఇయ్యాలి."

"అయ్యో; ఇవాళ పొద్దుట నువ్వు ఫోన్ చేసినప్పుడు కనబడ్డాడోయ్. ఈ మధ్యనే ఇల్లు మార్చేడట. ఇదివరకుండే ఇల్లు తెలుసు." అన్నాను.

"పోనీ, ఈ ఉత్తరం తీసికెళ్ళి వాళ్ళు ఇదివరకు ఉండే ఇంట్లో ఇచ్చేద్దామంటావా?" అని సదాశివరావు కూడా నా మీద జోకువేసేడు.

రాజారావు మా వూళ్ళో ఉన్న ఒక ప్రభుత్వ సంస్థలో ఏదో కొంచెం పెద్ద వుద్యోగమే చేస్తున్నాడు. కథలూ నవలలూ రాయడం హాబీ. భార్యార్జితం, పూర్వార్జితం దిట్టంగా వుందికనక తనురాసిన పుస్తకాలు తనే అచ్చువేయించుకుంటూ ఉంటాడు. ఇంటినిండా పుస్తకాలే. ఓసారి అతనింటికి (అదే, పాతఇంటికి) వెళ్ళి ఆ పుస్తకాలన్నీ చూసి ఆశ్చర్యపడ్డాను. "నీకేదైనా పుస్తకం కావాలంటే ఆ రెండు షెల్ఫులు జోలికి పోకు. ఇదిగో ఈ బీరువాలో ఉన్న పుస్తకాల్లో ఏదైనాసరే పట్టుకెళ్ళు. తిరిగి ఇచ్చినా ఇవ్వకపోయినా ఫరవాలేదు" అన్నాడు, ఒక షెల్ఫులో "రాజారావు గారికి, అభివందనాలతో" అని ఆయా రచయితలూ, ప్రచురణలు కర్తలూ ఇతర మిత్రులూ ఇచ్చిన పుస్తకాలు ఉన్నాయి. రెండో షెల్ఫులో రాజారావు కొనుక్కున్నవి ఉన్నాయి. ప్రతి పుస్తకంలోనూ అట్ట తెరవగానే వచ్చే ఓపెనింగ్ పేజీలో రాజారావు సంతకం, అది కొన్న తేదీ, స్థలం దాని వెల రాసి వున్నాయి.

మూడో బీరువాలో అన్నీ అతనురాసిన పుస్తకాల కాపీలే ఉన్నాయి. కొన్ని డజన్ల లెక్కని ఉన్నాయి. కొన్ని వందల సంఖ్యలో ఉన్నాయి.

"ఏదైనా మంచి పుస్తకం నువ్వే ఎంచి ఇయ్యి" అన్నాను.

"చూడు, నేనొకటి చెప్తాను. ఎవరిదగ్గిరికైనా వెళ్ళినపుడు మీకెంతమంది పిల్లలు; ఈ ఇల్లు కట్టడానికి మీకెంత ఖర్చయింది; మీ వి.సి.ఆర్. ఇండియాలో తయారైందా లేక ఇంపోర్టెడా; ఇలాంటి కొశ్చన్లు ఎన్నైనా వెయ్యిగాని మీ పిల్లలందరిలోకి ఎవరు మంచి - అని మాత్రం అడక్కూడదు"

"నేను మీ పిల్లల వూసే పెట్టలేదు, రాజారావు!" అన్నాను.

"నా పుస్తకాలు నాకు నా పిల్లల్తో సమానమే. అవన్నీ నా రక్తమాంసాలు పంచుకొని పుట్టక పోయినా నా మేధా సంతానం అన్న సంగతి నువ్వు మరిచిపోకూడదు".

"అది సరేలేవోయి. నేను తిరిగి ఇచ్చేసే పద్ధతిలో ఇదుగో, ఈ పుస్తకం పట్టికెళ్లా లనుకున్నాను. అలాగే ఇదుగో ఇదొకటీనీ-" అని మొదటి రెండు షెల్ఫుల్లోంచీ రెండు పుస్తకాలు ఎంచుకున్నవి బైటకి లాగేను. రాజారావు ఆ రెండు పుస్తకాల్నీ ఒక చేత్తోనూ నన్ను రెండో చేత్తోనూ పట్టుకొని సోఫా దాకా నడిచేడు. (పుస్తకాలు టీపాయి మీద కూచున్నాయి, నేను సోఫాలో.

"ఇది నాకు నారాయణరెడ్డి గారు స్వయంగా సంతకంపెట్టి ఇచ్చిన కాంప్లిమెంటరీ కాపీ" అన్నాడు రాజారావు.

"సంతకం స్వయంగా పెట్టకపోతే ఇంకెవరి చేతయినా పెట్టిస్తారేంటీ?"

"బోల్డుమంది! బెస్ట్ కాంప్లిమెంట్సుని రబ్బరు స్టాంపు కొట్టి పంపినవీ ఉన్నాయి! అంచేత - ఈ పుస్తకం నువ్వు చదివి ఇవ్వాలనుకున్నాసరే; ఏ సిటీబస్‌లోనో, కాఫీహోటల్లోనో మర్చిపోతే అది అలా అలా సెకండ్‌హాండ్ బుక్ స్టాలుకు చేరుతుంది. అప్పుడు నారాయణ రెడ్డి గారు ఆ పుస్తకం కొనేసి పునరభివందనాలతో నాకు పంపేరనుకో. దాంతో మాకిద్దరికీ అవమానమే కదా!"

"అలా ఎన్నటికీ అవదు. నేను ఈ పుస్తకం ఎక్కడా మర్చిపోను. ఒకవేళ మర్చిపోయినా ఇది ఎవరికైతే దొరుకుతుందో వారు, దీన్ని సెకండ్‌హాండ్ మార్కెట్‌లో అమ్మరు. నేనింతవరకు నారాయణ రెడ్డిగారి పుస్తకం సెకండ్‌హాండ్‌లో చూళ్లేదసలు"

"అంటే ఆయన రాసిన పుస్తకం ఎవరూ ఎవరికీ ఎరువు ఇవ్వలేదనే అనుకోవాలితప్పా-"

"పోనీ, ఈ పుస్తకం మాటేమిటి?" అని అతను కొనుక్కున్నది చూపించి అడిగాను.

"సారీ బ్రదర్; ఇది నాకు రిఫరెన్సు బుక్కు, ముడిపదార్థం, ఇది ఇవ్వను."

చివరికి వందలకొద్దీ కాపీలు ఉన్న అతని స్వంత రచన, స్వంత (నిజభార్య) ప్రచురణ అయిన సరికొత్త పుస్తకం 'రక్తతర్పణానంతరం' అనేది తీసుకున్నాను. ఈ ఆరు నెలలబట్టి - నిజం చెప్పాలి కదా - ఆ పుస్తకం ఎప్పుడు చేత్తో పుచ్చుకున్నా రక్తం, తర్పణం, అనంతరం - ఇలాంటి అప్రాపంచికమైన విషయాలు నాకు అడ్డువస్తూనే ఉన్నాయి. ఒక్క పేజీ కూడా చదవలేదు.

రాజారావు అసిస్టెంటు జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రభుత్వ సంస్థకి ఫోన్ చేసేం. రాజారావు ఇంట్లో ఫోను ఇంకా కొత్త ఇంటికి మార్చలేదుట. 36-16-49ఏ-4; అరుణానగర్ అంటూ ఒక ఎడ్రస్ చెప్పేరు. "ఫోన్ పెట్టేకండి" అని వార్నింగిచ్చి, ఒక నిమిషం లైన్‌లో ఉంచి; వాళ్లపక్కింట్లో ఫోనుందండీ. ఆ నెంబరు 756435. వాళ్ళకి డయల్‌చేసి అక్కడికి దారి ఎలాగో అడగొచ్చు" అని సలహా ఇచ్చేరు.

సదాశివరావు విజృంభించేడు.

అయితే ఆ యింటి వాళ్లెవరో రాజారావు కంటే కూడా మంచివాళ్లలా ఉన్నారు. "ఆయన ఇంట్లోనే ఉన్నారండీ, పిలుస్తాం, మీరు లైన్‌లో ఉండండి." అన్నారు.

సదాశివరావు మాట్లాడేడు. "మీ ఆవిడ నిన్న బెజవాడ వెళ్లేరు కదా. మీ బావమరిది గారున్న ఇంట్లోనే మా తమ్ముడు ఉన్నాడు కదా. మా తమ్ముడితో పనుండి ఆ ఇంటికి వెళ్తేనూ; మీ ఆవిడ నన్ను గుర్తుపట్టి నీకిమ్మని ఒక ఉత్తరం ఇచ్చేరు. అర్జంటుగా నీకు ఇవ్వాలన్నారు. తెచ్చేను. నువ్వు నా రూమ్‌కి వస్తావా, నన్ను మీ ఇంటికి రమ్మంటావా?"

"మా ఆవిడ ఉత్తరమా? ఏం వుండదు, దాంట్లో. క్షేమంగా చేరేను; అంతా బావున్నారు. హోటల్లో తినకండి; ఇంట్లోనే వండుకోండి. ఆవకాయ ఇష్టంకదాని ఎక్కువ తినీకండి - ఇలాంటి స్టఫ్ ఏదో వుంటుంది. నువ్వేం వర్రీ అవకు. నేను రేపు ఆఫీసుకెళ్లేటప్పుడు నువ్వుదిగిన హోటలుకొచ్చి తీసుకుంటాను. నువ్వు నేనొచ్చే టైముకి బైటికెళ్లిపోయే అవసరం ఉంటే ఉత్తరం రిసెప్షన్‌లో ఇచ్చి." అన్నాడు రాజారావు.

"ఆవిడ అర్జెంటుగా ఇమ్మన్నారయ్యా బాబూ!" అన్నాడు సదాశివరావు.

"అసలు నిన్ను ఆ ఉత్తరం ఎవడు పుచ్చుకోమన్నాడు? పనిలేనివాడు బ్రాహ్మణవీధికి వెళ్లేడట" అన్నాడు రాజారావు. సామెత షాక్‌లో పడి సదాశివరావు ఊరుకున్నాడు. మళ్ళీ రాజారావే మాట్లాడేడు.

"ఆల్‌రైట్. ఆ ఉత్తరం చదివి వినిపించు..."

"ఓకే, ఓకే. లైన్‌లో ఉండు" అని ఫోన్ నాకిచ్చేడు సదాశివరావు. ఓ నిమిషం తరవాత, ఓపెన్‌చేసిన ఉత్తరం కూడా నాకే ఇచ్చేడు "చదివీ!" అని సంజ్ఞ చేసేడు.

"హలో, రాజా లైన్లో ఉన్నావా? చదువుతున్నాను - ప్రియమైన శ్రీవారికి. నేను క్షేమంగా చేరాను. ఇక్కడంతా కులాసా. ఒక ముఖ్యమైన విషయం వ్రాస్తున్నాను. నన్ను రైలుకి దిగబెట్టినప్పుడు మీరు పట్టుకున్న పత్రికలో పాఠకుల లేఖ ఒకటి ఉంది - అయ్యా, నేను ఫలానా ఊళ్లో సెంట్రల్ జైల్లో యావజ్జీవ ఖైదీగా ఉన్నాను. ఇటీవల శ్రీ రాజారావు గారు రచించిన 'రక్తతర్పణానంతరం' అనే నవలపై మీ పత్రికలో సమీక్ష చదివాను. దాన్ని అనుసరించి ఆ పుస్తకం ఎంతో మంచిదని నేను భావించుచున్నాను. శ్రీ రాజారావు గారి వంటి ప్రఖ్యాత రచయిత పుస్తకాలు చదివే అవకాశం జైలులో ఉన్న మాబోటి వారికి కలగాలంటే మీరు మా తరపున వారిని కోరి; ఆ పుస్తకం ఒక కాపీ నా పేరిట పంపించే ఏర్పాటు చేయవలెను - ఇలా ఏదో ఉంది ఆ లెటర్‌లో. ఉత్సాహం చూపించే పాఠకుడు ఒకడు దొరికేడు కదా అని మీరు అతనికి మీ నవల కాపీ ఒకటి ఖర్చులు భరించి మరీ పంపేస్తారేమో అన్న భయంతో నేను ఈ ఉత్తరం రాస్తున్నాను. మీ పుస్తకంలో మన అడ్రసులు, టెలిఫోన్ నెంబర్లు అన్నీ ఉన్నాయి. ఇతను యావజ్జీవ ఖైదీ అయినా పక్క సెల్సులో ఉండేవాళ్లు ఎవరైనా త్వరలో విడుదల అయ్యేవాళ్లు ఉండొచ్చు. అందుచేత ఆ పుస్తకాన్ని జైలుకి పంపిస్తే కోరి ఆపద తెచ్చుకున్న వాళ్లం అవుతాము."

"ఓకే, థేంక్యూ, ఇంతేకదా?" అన్నాడు రాజారావు; ఫోన్ పెట్టేస్తూ.

ఆ మర్నాడు సదాశివరావు మా ఇంటికి వచ్చినపుడు 'రక్తతర్పణానంతరం' పుస్తకం చూసేడు. "నేను చదువుతాను" అని తీసుకున్నాడు.

"చదివితే చదువుగానీ జైలుకి మాత్రం పంపకు" అన్నాను. ★